ముంపు నుంచి బయట‘బడి’


తరగతి గదిలో పాఠాలు వింటున్న 9వ తరగతి విద్యార్థులు

- పెసర్లంక హైస్కూల్‌లో తరగతులు ప్రారంభం
- రెండు వారాల అనంతరం విద్యార్థులతో కళకళ

భట్టిప్రోలు: కృష్ణానది వరద తాకిడితో జలదిగ్బంధమై బయట పడిన భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు వారాల అనంతరం శుక్రవారం తరగతులు ప్రారంభమయ్యాయి. వరదల నేపథ్యంలో ఈ హైస్కూల్ పూర్తిగా నీట మునిగింది. పాఠశాలలోని ఫర్నిచర్, ఎన్ఎస్, పీఎస్ ల్యాబ్‌లు, స్పోర్ట్స్ రూమ్‌లోని పరికరాలు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. దీంతో హైస్కూల్‌ను శుభ్రం చేసేందుకు హెచ్ఎం ఎస్‌కే మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు సమష్టిగా శ్రమించారు. సొంత ఖర్చులు వేసుకుని కూలీలను పెట్టుకుని శుభ్రం చేయించారు. ప్రస్తుతం హైస్కూల్ ఆవరణ ఇంకా అస్తవ్యస్తంగా ఉండడంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వహించడం లేదు. విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచే క్యారేజీలు తెచ్చుకుంటున్నారు. ఇదే పరిస్థితి స్థానిక మండల పరిషత్ పాఠశాలలోనూ ఉంది. అగ్నిమాపక దళ సిబ్బంది వచ్చినా గదులలో బురదను మాత్రమే శుభ్రం చేశారు. బల్లలు, సామగ్రిని ఉపాధ్యాయులే శుభ్రం చేసుకోవాల్సి వచ్చింది. దీంతో నానా యతాన పడ్డారు. భట్టిప్రోలు కొల్లూరు మండలాల్లో కృష్ణా నదీ కరకట్టకు దిగువన ఈ ఒక్క హైస్కూల్ మాత్రమే ఉంది. హైస్కూల్‌ను మళ్లీ యథాతథస్థితికి తీసుకురావడానికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని హెచ్ఎం ఎస్‌కే మహబూబ్ బాషా కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లెరూరల్/వేమూరు: రేపల్లె మండలంలోని 11కేవీ కారుమూరు ఫీడర్, 11కేవీ గంగడిపాలెం ఫీడర్‌ల విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో వేజళ్లవారిలంక, కారుమూరు, గంగడిపాలెం, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం గ్రామాలలో ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్‌శాఖ డెప్యూటీ ఈఈ టి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

■ వేమూరు మండలం పెరవలి 33–11కేవీ సబ్ స్టేషను పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్టు విద్యుత్ సబ్ ఇంజినీరు గోపి శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన తెలిపారు.

■ రేపల్లె పట్టణంలోనూ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బస్టాండ్ నుంచి నిజాంపట్నం రోడ్డు మొత్తం, జేఎల్‌బీ కళాశాల రోడ్డులో, గరువు రోడ్డులో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

వేమూరు(చుండూరు): నిమ్మ తోటలో కూలి పనికి వెళ్లి పాము కాటుకు గురై సువార్త(50) మృతి చెందింది. చుండూరు మండలంలోని వలివేరు సచివాలయం పరిధిలోని అయన్నపాలెం గ్రామానికి చెందిన సువార్త గురువారం నిమ్మ తోటలో కూలి పనికి వెళ్లింది. సాయంత్రం పాము కాటుకు గురైంది. గమనించిన తోటి కూలీలు 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యసేవలు అందిస్తుండగా సువార్త మృతిచెందినట్టు చుండూరు ఎస్ఐ కె.సురేష్ శుక్రవారం తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పిట్టలవానిపాలెంకు చెందిన ఓ వ్యక్తి పాము కాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందటంతో శుక్రవారం కేసు నమోదైంది. చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ కథనం మేరకు పిట్టలవానిపాలెం గ్రామానికి చెందిన పెరుమాళ్ళ శ్రీనివాసరెడ్డిని 20 రోజుల క్రితం పాము కాటు వేయటంతో తెనాలి గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొంది స్వగ్రామానికి వచ్చాడు. ఇటీవల అతని ఆరోగ్యం మళ్లీ విషమించటంతో కుటుంబ సభ్యులు గుంటూరు గవర్నమెంటు హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బీజేపీ సభ్యత్వాల నమోదు

కర్లపాలెం: భారతీయ జనతా పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ బాపట్ల నియోజకవర్గ కన్వీనర్ కొమ్మనబోయిన మణియాదవ్ తెలిపారు. పార్టీ కర్లపాలెం మండల అధ్యక్షుడు పిట్టు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో కర్లపాలెం సెంటర్‌లో శుక్రవారం సభ్యత్వాల నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొక్కిగడ్డ శ్రీనివాసరాజు, మండల ప్రధాన కార్యదర్శి పిట్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు శివ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విపత్తు నివారణ యాప్‌లో వివరాల నమోదు



భట్టిప్రోలు: కలెక్టర్ ఆదేశానుసారం వరద ప్రాంతాలలో గృహ, వ్యాపార, వాహనాలకు జరిగిన నష్ట వివరాలను విపత్తు నిర్ధారణ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు పల్లెపాలెం గ్రామాలలో నమోదు ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్నారు. మండలంలోని చింతమోటు కొత్త కాలనీలో జరిగిన నమోదు కార్యక్రమంలో కోనేటిపురం, ఆళ్లమూడి పంచాయతీ కార్యదర్శులు ఎ.వెంకటేష్‌బాబు, గణేష్ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల్లో అన్నదానం



కర్లపాలెం: గణపతి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవటం ఆనందంగా ఉందని కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర తెలిపారు. శుక్రవారం కర్లపాలెం పంచాయతీ తెలగపాలెంలో జరిగిన గణపతి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్ర పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సురేంద్ర, ఏడుకొండలు, గోపి, అఖిల్, సోమశేఖర్, రాజా, నరసింహరావు, శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్నహస్తం


కిష్కిందపాలెంలో ముంపు బాధితులకు నిత్యావసరాలు పంపిణీ


తోకవాలవారిపాలెంలో సేవా సంఘాల సమైక్య సభ్యుల సాయం


పెసర్లంక హైస్కూల్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందిస్తున్న వాసవీ క్లబ్ నిర్వాహకులు

కొల్లూరు/భట్టిప్రోలు/ : వరద బాధితులను ఆదుకోవడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందుకు వచ్చారు. అమృతలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ వంతుగా ఇచ్చిన రూ. 50 వేలతో 470 కుటుంబాలకు వంట నూనె, గోధుమ పిండి ప్యాకెట్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నిరీక్షణరావు, ఉపాధ్యాయులు మాజేటి వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, గిరిధర్, దాసరి శ్రీనివాసరావు, రవి, ఆనంద్, మధు, విజయలక్ష్మి, రత్నకుమారి పాల్గొన్నారు.

■ కొల్లూరు మండలం తోకలవారిపాలెం, తురకపాలెం, కృష్ణనగర్ గ్రామాలలోని 350 కుటుంబాలకు శుక్రవారం చీరాల సేవా సంఘాల సమైక్య ఆధ్వర్యంలో రూ.5 లక్షల విలువైన నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి టి.కృష్ణమోహన్, చీరాల సేవా సంఘాల సమైక్య కన్వినర్ ఎం.రాఘవేంద్రరావు, సభ్యులు మురళీకృష్ణ, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

■ భట్టిప్రోలు మండలం చింతమోటు గ్రామ పంచాయతీ పరిధిలోని 500 వరద బాధిత కుటుంబాలకు కడప జిల్లా ప్రొద్దుటూరు బీసీ ప్రజా చైతన్య సమాఖ్య (బీసీ సంక్షేమ సంఘం అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు బాధిత కుటుంబాలకు దుప్పటి, లుంగీ, టవల్, షర్ట్, నిత్యవసర వస్తువుల కిట్లను అందించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు బొర్రా రామాంజనేయులు, ఉపాధ్యక్షులు వేల్పుల భాస్కర్, సుంకర వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీను, కార్యదర్శి మల్లేష్, నిర్వాహకులు మల్లెపు శ్రీనివాసు, మైలగాని శ్రీనివాసరావు, కర్లపాలెం మండల సమాఖ్య ఏపీఎం ఎస్. పూర్ణచంద్రరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొంటి సుబ్బారావు పాల్గొన్నారు.

■ భట్టిప్రోలు, వెల్లటూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం భట్టిప్రోలు మండలం పెసర్లంక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందించారు. భట్టిప్రోలుకు చెందిన బూర్లె త్రిశూల పాణిరావు జ్ఞాపకార్థం భార్య సుగుణావతి, కుమారులు విజయ్‌కుమార్, కిరణ్ కుమార్‌లు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్ను, పెన్సిల్, ఎరైజర్, షార్ప్‌నర్, స్నాక్స్ ఐటమ్స్ అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వి.సుబ్బారావు, నిర్వాహకులు ఎన్. నాగభూషణారావు, టి. శ్రీధర్, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, క్లబ్ సెక్రటరీ కొత్తా నాగ వెంకట రవి తేజ, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరి పోరాట యోధుడు


చింతర్లంకలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళి


భట్టిప్రోలులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో..

కొల్లూరు/రేపల్లె రూరల్/భట్టిప్రోలు : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి పోరాట యోధుడని పలువురు కొనియాడారు. ఆయన మృతిపై సర్వత్రా దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. ఆయనకు పలు చోట్ల సీపీఎం నాయకులు నివాళి అర్పిస్తున్నారు. కొల్లూరు మండలంలోని చింతర్లంకలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు తోడేటి సురేష్, రాచూరి కోటేశ్వరరావు, తోడేటి గాబ్రియేలు, టి. నాని, గుర్రం వెంకట్రావు, ఏసు, తోడేటి విక్టోరియమ్మ, గుంటూరు సోమయ్య, తోడేటి కిశోర్ పాల్గొన్నారు.

■ కొల్లూరు ప్రజా సంఘాల కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు, మాజీ ఎంపీపీ అమర్తలూరి కృపానందం, సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు బొగిగల సుబ్బారావు, పి.పరిశుద్ధరావు, తోడేటి శ్రీను, చాట్ల సుధాకర్, యశ్వంత్, పరిశుద్ధ జయలక్ష్మి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

■ రేపల్లె పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సీతారాం ఏచూరి మృతికి నేతలు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి నాయకుడు పి.నాగాంజనేయులు, సీపీఐ రేపల్లె ఏరియా సమితి కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, శంకరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

■ సీతారాం ఏచూరి చిత్రపటానికి శుక్రవారం భట్టిప్రోలు రథం సెంటర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు ఎం.సత్యనారాయణ, రామస్వామి, డి.సత్యనారాయణ, పి.అహరోను, జి.నాగరాజు, బసవ కోట్లు, నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, బసవయ్య, డానియేలు, సారథి, ఎస్ఎఫ్ఐ నాయకులు, పి.మనోజ్ కుమార్, పెసర్లంక మాజీ సర్పంచ్ బోరుగడ్డ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మోంట్‌ఫోర్ట్ పాఠశాల రజతోత్సవం


ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్‌లో పాల్గొన్న చిన్నారులతో ఉపాధ్యాయ బృందం

రేపల్లె రూరల్: క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యాబుద్ధుల్ని విద్యార్థులకు అందిస్తున్నట్లు మోంట్‌ఫోర్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ కిరణ్‌కుమార్ అన్నారు. మోంట్‌ఫోర్ట్ స్కూలును రేపల్లె పట్టణంలో నెలకొల్పి 25 ఏళ్లు గడిచిన సందర్భంగా శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణంలో నిర్వహించిన రజతోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక, సాహిత్య, క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై జాగ్రత్తగా ఉండాలి



చెరుకుపల్లి: కంటి సమస్యలను అశ్రద్ధ చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని కంటి వైద్యులు డాక్టర్ అరుణ రాణి సూచించారు. కొత్తపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బాపట్ల జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అరుణ రాణి మాట్లాడుతూ 5 నుంచి 15 ఏళ్ల పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అక్కల బాలాజీ, ఎంఎల్‌హెచ్‌పీ డి.వరకుమారి, ఏఎన్ఎం ఎస్.ప్రసన్న. కె.చాముండేశ్వరి, హసీనాబేగం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం


సాయం అందిస్తున్న దృశ్యం

వేమూరు(చుండూరు) పేద విద్యార్థులకు, వృద్ధులకు, వికలాంగులకు పోలే సాల్మన్ మెమోరియల్ ట్రస్ట్ తరుపున ఆర్థిక సాయం అందజేస్తున్నట్టు హెల్త్ ఎడ్యుకేటర్ పోలే కోటేశ్వరరావు తెలిపారు. చుండూరు మండలంలోని పెదగాదెలవర్రులోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏడు వేల రూపాయల ఆర్థిక సాయం అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుమ్మల ప్రసాద్, వైద్యఆరోగ్య సిబ్బంది ఎస్, కే జాన్, బీ సి హెచ్ భూలక్ష్మీ, భారతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

మురళీమోహన్‌కు గురుబ్రహ్మ అవార్డు



భట్టిప్రోలు: వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న గుర్రం మురళీ మోహన్ కాకినాడ చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గురుబ్రహ్మ అవార్డుకు ఎంపికయ్యారు. సాంఘిక శాస్త్రంలో చేస్తున్న కృషి, ఏపీఎస్ఎస్‌టీఎఫ్ ఫోరం తరపున వరద ప్రభావిత లంక గ్రామాల్లో అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వచ్చినట్టు చెబుతున్నారు. శనివారం కాకినాడ సూర్యా కళామందిర్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా ఈ అవార్డును గుర్రం మురళీమోహన్ అందుకోనున్నారు. మురళీమోహన్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

అధునాతన టెంట్లతో సినిమా ప్రదర్శన

- సినిమా ప్రదర్శనలో నవశకానికి శ్రీకారం
- ప్రభుత్వం అవకాశమిస్తే చిన్న సినిమాలకు వరం
- ఏపీ–మా వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా


మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: అధునాతన టెక్నాలజీతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో తాత్కాలిక టెంట్లలో పెద్ద స్క్రీన్‌తో సినిమాలను ప్రదర్శిస్తుండటం ఆహ్వానించదగ్గ పరిణామంగా ఏపీ–మా వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇందుకు అవకాశం కలిస్తే, చిన్న సినిమాలన్నీ విడుదలకు నోచుకుంటాయని, ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపాలని కోరారు.

స్థానిక మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్ 24 విభాగాల యూనియన్ కార్యాలయంలో శుక్రవారం కార్య నిర్వాహక సభ్యుల సమావేశం నిర్వహించారు. తమ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. తాత్కాలిక టెంట్లతో కేవలం రూ.50 టికెట్‌పై అన్ని మేజర్ పంచాయతీల్లోనూ సినిమాను ప్రదర్శించవచ్చనీ తెలిపారు. వినోదపన్ను మినహాయింపుతో సహా కొన్ని రాయితీలకు ప్రభుత్వం చొరవ చూపితే, సినిమా ప్రదర్శనలో కొత్త శకం ఆరంభం కాగలదన్నారు. థియేటర్లు దొరక్క, వదలకొద్దీ చిన్న సినిమాలు విడుదలకు నోచుకోలేదని గుర్తుచేశారు. ఒక నెలలో పెద్ద సినమాలకు మూడు వారాలు, మరో వారం చిన్న సినిమాల విడుదలకు అవకాశం కల్పించేలా చేసినా బాగుంటుందన్నారు సమావేశంలో నటులు మిలటరీ ప్రసాద్, అమీర్ చౌదరి, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకల్లో అన్నదానం

తెనాలిఅర్బన్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సాయిరామ్ యూత్ ఆధ్వర్యంలో రజక చెరువు వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ప్రతిమకు శుక్రవారం పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం


కొల్లూరులో పౌష్టికాహార మాసోత్సవాల ప్రదర్శన


కర్లపాలెంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న తహసీల్దార్ వెంకటరత్నం.

కొల్లూరు/కర్లపాలెం : పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత దరిచేరదని ఐసీడీఎస్ కొల్లూరు, అనంతవరం సెక్టార్ల సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, పి.నగ రాజకుమారి అన్నారు. శుక్రవారం కొల్లూరు బైపాస్ రోడ్డు ప్రాంతం, పెసర్లంక అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు గృహాలలో అందుబాటులో ఉండే ఆకుకూరలు, చిరుధాన్యాలతో తక్కువ ఖర్చుతో పౌష్టికాహారాన్ని తయారు చేసుకొని శరీరానికి అవసరమైన పోషకాలను అందించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పెసర్లంక సర్పంచి వి.నాగమణి, ఏఎన్ఎం సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

■ కర్లపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహారం అందజేయటంతోపాటు చిన్నారులకు అన్నప్రాశన చేశారు. తహసీల్దార్ వెంకటరత్నం మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు, సీడీపీఓ లక్ష్మి పార్వతి, సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా హిందీ దినోత్సవం


సత్కారం అందుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులతో అతిథులు

తెనాలి: పట్టణ మారిస్ పేట లోని నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ హైస్కూలులో శుక్రవారం హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా శాఖ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన వేడుకలకు హిందీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనిమిరెడ్డి విజయకుమార్ అధ్యక్షత వహించారు. 1949 సెప్టెంబర్ 14వ తేదీన హిందీ భాషను అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి హిందీ దివస్ వేడుకలను దేశమంతటా జరుపుకుంటున్నట్టు ఆయన గుర్తుచేశారు. హిందీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, హైస్కూలు హిందీ ఉపాధ్యాయుడు పులి భాస్కర్ మాట్లాడుతూ సంస్కృతం నుంచి గ్రహించిన, హిందీ భాష క్రమంగా విద్యార్థులందరికీ చక్కగా అర్థమయ్యేలా సులభతరం చేశారని చెప్పారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో హిందీ ముఖ్య భాషగా ఉందన్నారు. ప్రముఖ హిందీ గురువు జీవీఎస్ వరదాచార్యులను వేదికపై ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత జీవీఎస్ వరదాచార్యులు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువగా మాట్లాడే భాషల్లో హిందీ రెండవ భాషని, ‘లాంగ్వేజ్ ఆఫ్ యూనిటీ’గా మహాత్మా గాంధీ అన్నారని గుర్తుచేశారు. హిందీ నేర్చుకుంటే దేశంలో ఎక్కడికి వెళ్లినా భాష సమస్య లేకుండా జీవించవచ్చని తెలిపారు.విద్యార్థులందరూ హిందీ చక్కగా నేర్చుకోవాలని సూచించారు. తెనాలి పట్టణంలోని గల హైస్కూళ్లలో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులనూ ఇదే వేదికపై ఘనంగా సత్కరించారు. హిందీలో అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహూకరించారు. కేరళలోని వయనాడు బాధితులకు వితరణ అందించిన విద్యార్థులకూ జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. హిందీ ఉపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు తాటి నరేష్ పాల్గొన్నారు

అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం


అగ్నికి ఆహుతవుతున్న ఇళ్లు

నగరం: అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని సిరిపూడి గ్రామంలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు సిరిపూడి గ్రామానికి చెందిన పిట్టు వెంకటేశ్వరరెడ్డి (చిన్నోడు) పూరింటికి మంటలు చేలరేగాయి. ఈ మంటలు వ్యాపించి పక్కనే ఉన్న సుబ్బారెడ్డి పూరింటికి అంటుకోవడంతో రెండు పూరిళ్లు దగ్గమయ్యాయి. రాత్రి సమయం కావడంతో ఇంట్లో ఉన్నవారు కట్టుబట్టలతో బయటకు వచ్చారు. ఇంటిలోని విలువైన సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. అగ్ని ప్రమాద సమాచారాన్ని స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి తెలిపారు. రేపల్లె అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకునే సమయానికి రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. వెంకటేశ్వరరెడ్డి ఇంటిలోని బంగారం, నగదు ఆహుతయ్యాయని బాధితుడు కన్నీటిపర్యంతమయ్యాడు. సుమారు రూ.6 లక్షల ఆస్తినష్టం వాటిలినట్లు స్థానికులు చెప్పారు.

జీఓ నంబర్ 115ను రద్దు చేయాలి

బాపట్లటౌన్: స్టాఫ్ నర్స్‌లకు అన్యాయం చేసేలా ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 115ను వెంటనే రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కూరపాటి సత్యంరాజు కోరారు. శుక్రవారం జిల్లాలోని స్టాఫ్‌నర్స్‌ల అసోసియేషన్ నాయకురాలు జానకి ఆధ్వర్యంలో స్టాఫ్ నర్స్‌లు జేసీ ప్రఖర్‌జైన్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్‌లు ఉషా, సౌమ్య, కళ్యాణి, వినిలా, కరుణ, మాస్తాన్‌బి, కల్పన పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

పదిమంది అరెస్ట్

బాపట్లటౌన్: మండలంలోని పేకాట స్థావరాలపై రూరల్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. మండలంలోని కంకటపాలెంలో పేకాట అడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3,015 స్వాధీనం చేసుకున్నారు. జమ్ములపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3,370 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ గంగాధరరావు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బాపట్ల డివిజన్
95055 07638 (బాపట్ల)
90102 23706 (వేమూరు, రేపల్లె)
Office mail : sakshigntadvt@gmail.com